# 10. సాంబారు సిన్మాలు

"ఈ దరిద్ర భారతాన్నుద్ధరించేందుకుగాను మన అదృష్టం కొద్దీ అవతరించిన అపర కల్క్యవతారమే శ్రీమతి ఇందిరా గాంధీ." అని ఆ మధ్య ఓ కవిగారు సెలవిచ్చిన పంచ రత్నాలకు డబ్బున్న దేశభక్తులెవరేనా అక్షర లక్షలివ్వటం భావ్యం.

ఆవిడ భారత రాజకీయాలను విప్లవాత్మకంగా తీర్చి-మార్చి పారేసిందనేది నిస్సందియమే. కాదనే వాళ్ళ కబుర్లు మనం వినగూడదు. పొరపాటున విన్నా తక్షణం డెట్టాల్ కలిపిన వేడినీళ్ళతో మన పవిత్ర కర్ణేంద్రియాలను శుద్ధి జేసుకోవటం మంచిది.

ఇందిరాజీ తాజా విప్లవచర్య అమెరికన్ సినిమాల దిగుమతికి ఈ ఏప్రిల్ ఫస్ట్ నుండి స్వస్తి చెప్పటం.

ఈ వార్త విన్న ఢిల్లీ, బొంబే లైట్ పాంట్ కుర్రాళ్ళూ, కలవారి బిడ్డలూ—"బాబోయ్! నాయనోయ్! జేమ్సుబాండ్ సిన్మాలూ; కిల్, కిల్ - కిస్, కిస్ సిన్మాలూ, న్యూయార్క్ బై నైట్, సుబ్బమ్మ బై నైట్ సిన్మాలూ చూడకుండా బ్రతకటమే? అంతకన్నా ఆత్మహత్య హాయి

గదా" అని గుండెలు బాదుకుని, గ్లిసరిన్ లేకుండానే ఘోరంగా ఏడ్చేసి, గంజాయి దమ్ముతో అవసరం లేకుండానే మూర్ఛ పోయార్ట.

మన పవిత్ర భారతీయ సంప్రదాయాల్ని, సినిమాల్ని, వీధి భాగవతాల్ని, తోలుబొమ్మలాటల్ని మర్చిపోయి అమెరికన్ సినిమాలు చూడకుండా బ్రతకలేని స్థితికి వచ్చిన ఈ బూర్జువా కుర్రాళ్ళకు ఆ మాత్రం శాస్తి కావలసిందే. ఆ లెక్కన ఈ నిషేధం నిజంగా విప్లవాత్మకమే.

"అవునుగానీ, సార్ ! ఎంత పుణ్యం, బొందితో కైలాసం వగైరాలు దొరుకుతా యనుకున్నా మూడు గంటల పాటు మన పవిత్ర భారత సిన్మాల్ని కునికిపాట్లు పడకుండా చూట్టం, ఆ సిన్మా తీసిన వాడి ఏడు తరాలనూ, రాసిన వాడి మూడు తరాలనూ, వేషాలేసిన వాళ్ల రెండు తరాలనూ దీవించకుండా ఉండగలగటం ఎలా ?" అని కుళ్ళుంకలు వేసే రివిజనిస్టు సినీ ప్రేక్షకులు కొందరున్నారు.

నిజమే ! 'ఓరిమి గాడిదల సుగుణం' అని ఓ రష్యన్ కామ్రేడ్ రైటర్ సెలవిచ్చాడు. అది చదివి శాంతి సహనాలకు నెలవయిన ఈ కర్మ భూమిలోని సినీ ప్రేక్షకులు కూడా చాలా మంది చెడిపోయారు. లేకుంటే నూరేళ్ళ జీవితంలో మూడు గంటలు ఓ లెక్కలోవా ? పొరుగింటి హాలీవుడ్ పుల్లగూర సిన్మాల మీద మోజు కాకుంటే మన పవిత్ర భారత గోంగూర సిన్మాల కన్నా అవేం గొప్పవి గనుక.

నిస్సందేహంగా మన సినిమాలే గొప్పవి. మన బాంబే రంభ హెలెన్‌లా ఒక్క ఆలీవుడ్డు డాన్సరన్నా సృజనాత్మక నృత్యాలు చేయగలదా? మన మద్రాస్ మేనక జ్యోతి లక్ష్మిలా ప్రేక్షకుల్ని ఊపి పారేయాలంటే ఆలీవుడ్ ఊర్వసి రాక్వెల్ వెల్చ్ మద్రాసొచ్చి ఆర్నెల్లపాటు సాంబారిడ్లీ తింటూ ట్రయినింగవ్వాల్సిందే గదా!

మన పవిత్ర భారత సినీహీరోల్లా ఆలీవుడ్ హీరోల్లో ఒక్కడేనా ట్విస్ట్ డాన్స్ చేసి ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టించుకోగలడా? సూటు నలగకుండా మేకప్, చెదరకుండా చెట్లెక్కి యుగళ గీతాలు పాడగలడా?

మన పవిత్ర భారత సినీహీరోయిన్లలా ఏ ఆలీవుడ్ సుబ్బమ్మ అయినా తెరవెనుక ముప్ఫై మూడు వాయిద్యాలను రెడీగా పెట్టుకుని, జుట్టు విరబోసుకుని, ఆరిపోనున్న నూనె దీపం ముందు అందంగా కూర్చుని, పమిట కాస్త జార్చి మరీ రాగ-తాళ యుక్తంగా శోక గీతాలు పాడగలదా? అవతల హీరోయో, వాడి బాబో చచ్చే క్లైమక్సు రపీమని ఆ నూనె దీపం ఆరిపోయేలా చేయగల దివ్యజ్ఞానం మన పవిత్ర భారత సినీడైరెక్టర్లకు తప్ప ఆ హాలీవుడ్ మ్లేచ్ఛ దర్శకుల కెలా సాధ్యం?

నిజంగా సినిమా రంగంలో భారతీయులు జీనియస్సులే. లేకుంటే ఒకే పవిత్ర భారత సాంప్రదాయిక గాథను వంద రకాలుగా మార్చి-మార్చి వ్రాయటం, తీయటం మాటలా?

ఓసారి పులుసు కూరగా, ఇంకోసారి వేపుడు కూరగా, మరోసారి శుద్ధ రోస్టుగా, అదీ అయ్యాక సాంబారుగా, రకరకాలుగా అదే కథను - అదే నటుల్తో, నటీమణుల్తో తీసి అమాయక భారత సినీప్రేక్షకులను మెప్పించి మేడలు కట్టాలంటే ఎంతటి సృజనాత్మక ప్రతిభ కావాలి.

"అయ్యో! నా ఈ విగ్రహ పుష్టి, కండల యిష్టి ఇదంతా హీరోల చేతుల్లో తన్నులు తిని వేన్నీళ్ల కాపులు వేయించుకునేందుకేనా ? నా అందం చందం అంతా హీరోయిన్ల చేత తిట్లూ, శాపనార్థాలూ పెట్టించుకునేందుకేనా ? నేనే హీరోనయి వాళ్ళనెందుకు తన్నగూడదు హీరోయిన్లతో యుగళ గీతాలు పాడి పార్కుల్లో ఎందుకు దొర్లగూడదు?" అని ఆ మధ్య మన విలన్‌గారు ఒకరు వాపోయారు.

కానీ ఆయనగారు ఉత్త అమాయకుడు. పవిత్రభారత సినీసాంప్రదాయాల ప్రకారం హీరోలున్నంతకాలం విలన్‌లు ఉండి తీరాల్సిందే! పిడిగుద్దులూ, కఱ్ఱ దెబ్బలూ, కత్తిపోట్లూ, చివరి సీన్‌లో యముడి దున్నపోతునెక్కి షికారెళ్ళటం వగైరా అన్నీ శాస్త్రోక్తంగా ఉండి తీరాల్సిందే!

ఆ మాటకొస్తే మన పవిత్ర భారత విలనేశ్వరుల్లా ఒక్క హాలీవుడ్ విలనుడయినా భయంకరంగా, చూసీ చూడగానే 'వీడేరా విలన్' అనిపించేలా మేకప్ చేసుకోగలడా? క్లోజప్‌లో బుడ్డెడు నాటుసారా గడగడా త్రాగేసి. గుడ్లెఱ్ఱజేసి, మైకు బ్రద్దలయ్యేలా ఓండ్ర పెట్టి పిల్లకాయలు దడుసుకుని ఉచ్చోసుకునేలా చేయగలడా

కథా నిలయం
758



హీరోయిన్ని పట్టుకుని కాళ్లూ చేతులూ కట్టేసి, చీకటి కొట్లో పడేసికూడా కనీసం ఆవిడ బుగ్గను గిల్లటానికేనా తొందరపడని రావణబ్రహ్మ లాంటి అపర పురాణ పురుషులు గదా మన విల్లన్లు. ఈ నిగ్రహం. ఈ ఓరిమి వగైరాలన్నీ మన పవిత్ర భారత సినీ విలన్‌ల ప్రత్యేకతలని కూడా సదరు విలన్‌ల గుర్తించి గర్వించాలి.

"అయితే, అమెరికన్ సిన్మాల్లో మనం నేర్చుకోవాల్సినవేవీ లేవా? ఆహాఁ! ఏమి సెట్టింగులు, లొకేషన్‌లు, ఏమి కథ, ఏమినటన, ఏమి ఫొటోగ్రఫీ, ఏమి మర్డర్లు? ఆహా! ఓహో!" అని వాపోయే నయా రివిజనిస్టులు కొందరున్నారు.

నిజమే! నేర్చుకోవాలంటే చాలానే ఉన్నాయి. 'హౌ టు స్టీల్ ఎ మిలియన్' లాంటి అపూర్వ ప్రబోధాత్మక చిత్రాలను తీయటంలో మనమింకా వెనుకబడే ఉన్నాం. తెలుగుజాతికే గర్వకారణంగా ఆ మధ్య ఢిల్లీ నేషనల్ మ్యూజియంలో ఓ పెద్ద దొంగతనం చేసి సుప్రసిద్ధుడయిపోయిన ఆ తెలుగువాడు తెలుగు సినిమా చూసిగాక ఆ హాలీవుడ్డు సిన్మాచూసి మరీ అంతటి తెలివితేటల్ని, ధైర్యసాహసాల్ని పొంది ఉండటం మన పవిత్ర భారతసిన్మాల కేమంత గర్వకారణం గాదు; నిజమే! అందుకేగదా, వేదికెక్కిన ప్రతి నాయకుడూ ప్రబోధాత్మక చిత్రాలు తీయాలని వాపోయేది.

అలాగే "సృష్టిలోని సకలానర్థాలకు మూలం ఆడదే! మగవాడిలోని పశుత్వాన్ని రెచ్చగొట్టి, వాడిలోని నైచ్యాన్ని

వెలికితీసి చెడగొట్టేందుకే ఉంది ఆడది!" అనే సారాంశాన్ని తెలివిగా, అందంగా, ఆకర్షణీయంగా అమాయక ప్రేక్షకులకు నూరిపోసే విషయంలోకూడా ఆ హాలీవుడ్డు వాళ్ళతో పోలిస్తే మనమింకా వెనుకబడే ఉన్నాం.

అరసెకండులో అరడజన్ మంది దుష్టుల్ని ఠపీ-ఠపీమని కాల్చి పారేసి, నవ్వుతూ సిగరెట్ ముట్టించి, ఓ పెగ్గు బిగించి క్లబ్ డాన్సర్ బుగ్గగిల్లి, ఆవిడ నడుంచుట్టూ పిస్తోలున్న చెయ్యి బిగించి, పడగ్గదిలోకి నిశ్చింతగా దారితీయగల మేటి హాలీవుడ్ తాజా హీరోల్లాంటి పవిత్ర భారత హీరోల్ని మనం ఇంకా తయారుజేసుకోవలసే ఉన్నాం.

నిస్సందేహంగా భవిష్యత్తులో మనం ఈ హాలీవుడ్ సినిమాల తలదన్నగల అద్భుత చిత్రరాజాలు నిర్మించగలం. సత్యజిత్‌రాయ్‌లనూ, మృణాల్ సేన్‌లనూ చూసి బెదిరిపోనక్కర్లేదు. వాళ్ళ సిన్మాలే చూస్తూ సిన్మాహాల్లో నిద్రపోవాల్సొస్తుందని మన బైట్‌పాంట్ కుర్రాళ్ళు ఆత్మహత్యలకు పాల్పడనక్కర్లేదు. ఆత్మహత్య మహాపాపమని మన పవిత్ర పురాణాలన్నీ ముక్తకంఠంతో ఘోషిస్తున్నాయి.

అయినా, మనలోమాట! ఈ రాయ్‌ల, సేన్‌ల సిన్మాలు ఎవడు చూస్తాడండీ? మార్నింగ్ షోలు వేస్తేతప్ప!

మరయితే సోషలిజం సంగతేమంటారా? అబ్బే! అవన్నీ రాజకీయాలు... మనకెందుకా గొడవ! మనం కళాకారులం! మన పని పవిత్ర భారత సిన్మాల్లో విప్లవాత్మక పరిణామాల్ని పిలకబట్టి ఈడ్చుకురావటమే!

(జూలై 1972)